# రంగయ్యతాతగారి పరువు మర్యాదలు

రంగయ్యతాత లక్షాధికారి, వయోవృద్ధుడు, మాననీయుడు. ఊళ్ళో అంతా ఆయన్ని భయభక్తులతో చూస్తారు. గొప్పగొప్పవాళ్ళంతా ఆయనయొక్క సద్గుణాలు మెచ్చుకుంటారు.

"ఈ ప్రాంతాల ఆడితప్పనివాడుంటే అది రంగయ్యతాతగారే!" అని డిప్టీ కలెక్టరుగారెప్పుడూ అంటారు.

"ధనవంతుణ్ణని ఆయనకేమీ అతిశయంలేదు." అని శిరస్తాదారుగారు చాలా ఎన్నికచేస్తారు.

"అతిథుల్ని సత్కరించటంలో ఆయన తరవాతే యెవరైనా!" అని మేజస్ట్రేటుగారు సాక్ష్యం ఇస్తారు.

"వితరణలో ఆయనచెయి మహా పెద్దది!" అని లోకలుఫండు ఇంజనీరుగారు ఒప్పుకుంటారు.

ఇంతమంది ఇన్నివిధాల యెన్నికచేసిన మనిషిమీద ఆయన సంతానమే కత్తి కట్టిందంటే మావూళ్ళో వాళ్ళందరికీ కష్టంవేసిన మాట నిజమే. రాను రాను కుర్రకారు మరీ అధోగతి పాలుకావటానికి ఇదే తార్కాణం!

ఆయనమీద కత్తికట్టి కుర్రవెధవలేమైనా బాగుపడ్డారా అంటే అదీ కనిపించలేదు. ఒకడు తాతగారు బతికుండగానే ఆయనఉన్న ఊళ్లోనే కాఫీహోటల్లో ప్లేట్లు అందిస్తూ, పరువు తక్కువవాళ్ల ఇళ్ళలో మకాం పెట్టాడాయె. ఇంకో మనవడు కంపెనీవాళ్లకి హార్మోనియం వాయిస్తున్నాడాయె. మరొకడు కులగోత్రాలులేని వితంతువును పెళ్ళాడి ఆ మనిషిచేత పోషింపబడుతున్నాడాయె. ఇంకో అప్రజకుడు ఊళ్ళో ఉన్న మోటార్లూ, ఆయిల్ ఇంజన్లూ బాగుచేస్తూ మసిగుడ్డలతో తిరుగుతాడాయె.

ఇదేనా తిరుగుబాటు? తిరుగుబాటంటే మొహంమీద కోపంవచ్చి ముక్కు కోసేసుకోవటమేనా?

రంగయ్యతాతగారి మనమళ్ళలో ఒకణ్ణి పట్టుకుని నాలుగుముక్కలూ ఝాడించి అడిగాను.

“నువు చాల పొరపాటు పడుతున్నావు,” అన్నాడు వాడు. “మేం తిరగబాటయితే చేశాంగాని మొహంమీద కోపంతో ముక్కు కోసుకున్నమాట అబద్ధం. మావిధి మేం నిర్వర్తిస్తున్నాం. మా ఆత్మలని మేం రక్షించుకోవటమే కాకుండా, మా పొట్టలు మేం పోసుకుంటూ ఇంత కాలానికి జీవితంలో ఆనందమేమిటో తెలిసికోగలిగాం.

“నామటుకు నేను కాఫీహోటల్లో పనిచేస్తాను. శరీరానికి తగినంత చాకిరి. పొట్టకు కడుపునిండా తిండి. నాపని అయిపోగానె హాయిగా వైట్‌రోజ్ సబ్బు పెట్టి వేణ్ణీళ్ళ స్నానంచేసి, మంచి ఇస్త్రీమడతలు వేసుకుని, జుట్టుకి వాసననూనె రాచి మంచి సిగిరెట్టు వెలిగించి ఏ సినిమాకో పోతాను. ఈ వూళ్ళో ఏ సినిమాకుగాని నాటకానికిగాని, సర్కసుకుగాని నాకు టిక్కెట్టక్కర్లేదు. పన్నెండింటిదాకా పచార్లు కొట్టివచ్చి పడుకుంటే వెర్రినిద్ర పడుతుంది. కలకూడా రాదు. మళ్ళీ టంచనుగా అయిదింటికల్లా లేచి పనిలో జొరబడతాను.

“నాకేమిటి లోటు? వెనకటి ఆశ్రమంలో నాకేమీ ఉండేదికాదు-అసంతృప్తి తప్ప చేసేటందుకు పనిలేదు. తినేటందుకు తిండీలేదు. కాఫీకి అర్ధణా కావాలంటే రంగయ్యతాతకి తెలియాలి. సిగిరెట్టు కొనుక్కుందామంటే అసలేలేదు. ఎప్పుడూ సిగరెట్లు ముట్టేగద! దరిద్రం మండా? రంగయ్య మనమడికన్న దరిద్రుడు లేడుగద! అందరికీ నేనంటే హడలే-ఎక్కడ సిగరెట్టడుగుతానో, ఇప్పించమంటానో అని. ఇతరత్రా నేనంటే ఇష్టమైన వాళ్ళకూడా ఈ మూలంగా నేనంటే భయం! పేరుకుమటుకు రంగయ్య మనమడు! లక్షాధికార్ల బిడ్డ...దొంగతనాలు చేసేవాణ్ణి! ఇంటిడబ్బే అనుకో! అయినా దొంగతనానికి పాల్పడిం తరవాత నా మొహం దొంగమొహమే!...ఏవిధంగా చూసినా, నన్ను చూస్తే నాకే ఏవగింపుగా ఉండేది. రాత్రిపూట నిద్రపట్టేదికాదు. పడితే పీడకల లొచ్చేవి......పైగా రంగయ్యతాత అజమాయిషీ! సినిమాకు పోవటానికి లేదు. పొద్దూకిన అరగంటలోపల ఇంటికి రావాలి. తొమ్మిదింటికల్లా నిద్రపోవాలి! డ్రిల్లూ!

“ఇంత ప్రాణాలు బిగబట్టుకున్నా ఎప్పుడో అప్పుడు రంగయ్యతాత గౌరవానికి హానికలగనే కలిగేది...సిగిరెట్టు కాలుస్తుండగా ఎవడో

పీనుగ చూడనే చూసేవాడు, ముసలాడికి చెప్పనే చెప్పేవాడు! ఇప్పుడే వెధవా చెప్పడు. కావలిస్తే ముసలాడి మొహానే పొగ విడుస్తాను...!

"మిగిలిన వాళ్ళూ నా మాదిరిగానే బాగుపడి పోయినారుగాని చెడిపోలేదు. మావాడొకడు మంచి ఇంజనీరు. వాడికీ డిగ్రీలేదుగాని ఉంటే వేలకువేలు సంపాదించును. ఎంత కొత్త యంత్రమైనా పట్టుకురా– నిమిషంలో అమర్చుతాడు. వాడిలైనులో వాడికి గొప్ప పేరు వస్తున్నది. చూస్తూఉండు, వాడెంత పైకొస్తాడో!...

"అవును, ఇంకోడు సంగీతంలో పడ్డాడు. వాడిచేతుల్లో సుఖంఉంది. ఆమాట నేననటంకాదు—మంచిపాటగాళ్ళే అన్నారు. రంగయ్యతాతయ్యమీద తిరగబడింతరవాత ఆరునెలల్లో వాడు మంచిహార్మోనిస్టయి కూచున్నాడు. లేనట్టయితే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుండవలసినవాడు. వాణ్ణి సినిమావాళ్లు తీసుకుంటున్నారు. నెలకు నూటయాభై ఇస్తారుట. రంగయ్యతాత వాడికి నెలకి నూటయాభై దమ్మిడీలుకూడా ఇచ్చిన పాపానపోలేదు..."

"వెధవ ముండని పెళ్ళాడాడని అందరూ వాడిమీద పడి ఏడుస్తారు. ఆవిడచేసిన మహాపాపం ఏమీలేదు. బతికుండగానే మొగుణ్ణి వదిలేసింది. వాడిసంగతి అందరికీ తెలును. పరువైన ఆడది ఎవతెకూడా వాడితో కాపరం చెయ్యదు. వాడి ధర్మాన వాడుచచ్చాడు. ఆ తరవాత మావాణ్ణి పెళ్లాడింది. పదెకరాల భూవసతిఉంది. మావాణ్ణి కూచోపెట్టి మేపుతున్నది. అది చూసి ఓర్వలేనివాళ్ళు ఆవిణ్ణి పీటి దంటారు. పీటిదైతే లేవదీసుకు పోవటాని కెవడైనా ప్రయత్నించడేం? రెండు నగలున్న దాన్నే వదలరుకదా ఆ మనిషిని వొదిలారేం?...అంతా వెధవకబుర్లు! వాళ్లిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు. ఆ మనిషి చాలా మంచిది. చచ్చినా ఇంకోడి కేసిచూడదు. ఆ మాట ఒప్పుకోవటం ఇష్టంలేక అసూయ కొద్ది అడ్డమైనకూతలూ కూస్తారు. నా ఉద్దేశం, అటువంటి భార్య దొరికినవా డెవడైనా అదృష్టవంతుడనే!..."

అంతా విన్నాను.

"ఇదంతా కాదనను గాని, అబ్బాయీ, నువొక పొరపాటు పడుతున్నావు. జీవితమంటే కడుపునిండా, తిండీ, ఇష్టమైన వ్యాపకమూ,

ఎుష్వైన పెళ్ళామూ—ఇంతే ననుకుంటున్నావు. ఇంతకన్న విలవైన విషయాలున్నై. మాటవరసకి చెబుతున్నాను. మీ తాతగారు ఆడి తప్పని మనిషి, పేరుపడ్డ దాత, ఆతిథ్యం ఇవ్వటంలో అసమానుడైన గృహస్తు—!''

నామాట పూర్తి కానివ్వకుండానే రంగయ్య మనమడు గట్టిగా నవ్వి, "ఎవరు చెప్పారు నీకీ అబద్ధాలు?'' అన్నాడు.

"డిప్టీ కలెక్టరుగారూ, ఇంజనీరుగారూ అబద్ధా లాడతారా? శిరస్తాదారుగారు కూడానా?...ఆయన పరువు ప్రతిష్టల విలవ గ్రహించక పోబట్టే మీరంతా ఇట్లా చెల్లాచెదరై పోయినారు. ఇప్పటికైనా మీరు పశ్చాత్తాపపడి తిరిగి వస్తే ఆయన ముసలిప్రాణం—ఏక్షణాన హరీ అంటుందో మరి!—చాలా సంతోషిస్తుంది'' అన్నాను.

రంగయ్య మనమడు మళ్ళీ విరగబడి నవ్వి, "మా తాతకి పరువనేది ఉందని నువ్వనుకుంటున్నావు, ఉండొచ్చు. డిప్టీకలెక్టరుగారి దగ్గిరా శిరస్తాదారుగారి దగ్గిరా ఆయన ప్రవర్తన సరిగానే ఉండొచ్చు. కాని మా తాతకి నిజంగా పరువూ పాడూ ఏమీలేదు. పరువున్నవాడు మూడేళ్ళనాటి పాతగుడ్డలు పిగిలినందుకు చాకలాడికి డబ్బు విరగ్గో స్తాడా? పంటలు పండక రైతులు అలో లక్ష్మణా అని ఏడుస్తుంటే బకాయిపడ్డ ధాన్యానికి పత్రాలు రాయించి పుచ్చుకుంటాడా? కష్ట సమయంలో ఉండిన తన నౌకరీలోకి రాలేకపోయిన కూలివాళ్ళని పనిలోనించి తియ్యటమేగాక ఊళ్లో వాడికెవరూ పని ఇవ్వకుండా చేసి ఊళ్ళోనించి సాగనంపుతాడా? ఈ ఊరి అలగా జనంలో మా తాత చస్తే పండగ చేసుకోని వాళ్లుంటారా? దోపిడిచేసే దొంగ వెధవలికి పరువు ప్రతిష్టలేమిటి? కష్టపడి పని చేసుకునేవాడికి పరువు ప్రతిష్టలూ మానాభిమానాలు గాని!

"నన్ను చూడరాదూ? నేను చేసుకునే పని దాయను. నా సిగిరెట్లు దాయను, ఆఖరికి నామొండనుకూడా దాయను. కాని రంగయ్య నాకు తాత అనేది ఒకటే దాస్తాను. అదే నాకు తలవంపులు!... నేనే కాదు, మా అందరికీ అంతే! మా పానకంలో పుడక ఆ ఒక్క ముసలాడే! ఆయన పరువు ప్రతిష్టల సంగతి నాకు చెప్పావు గనక నా పరువు

ప్రతిష్టల సంగతి ఆయనకి చెప్పు. ఆయన్ని త్వరగా చచ్చిపొమ్మను. ఆయన ఒక్కడే, మేం పదిమంది. ముసలాడుచస్తే పదిమందిని సంతోషిస్తాం...ఆఖరుకు డిస్ట్రిక్ట కలెక్టరుగారయినా ఆ కెు ఏడుస్తారనుకోను!''

ఈ మాటలు వింటుంటే నాకేమనాలో తెలీదు.

''అబ్బాయీ, ఇదంతా నేను మీ అందరి శ్రేయస్సు కోరే చెప్పాను గనుక మరోవిధంగా అనుకోకు! మీరంతా నిజంగానే సుఖంగా ఉంటే నేను మరేమీ మాట్లాడను. నా ఉద్దేశంకూడా మీరూ మీరూ సుఖంగా ఉండాలనే...కాని మరొక్క విషయం అడుగుతాను చెప్పు: మీరంతా ఈ విధంగా నిరాధారపు జీవితాలు జీవిస్తున్నారు కదా; మీలో ఎవడైనా రెండురోజులు పడకవేస్తే మీ గతేమిటి? అదైనా ఆలోచించారా?'' అన్నాను.

రంగయ్య మనమడు జేబులోనించి అయిదురూపాయిల నోటొకటి తీసి, ''ఆలోచించేటందుకేముంది? ఇదిగో, ఈ అయిదురూపాయల్తో మావాడి కొకడికి మనిఆర్డరు చెయ్యబోతున్నాను. వాడేదో ఖర్చులో ఉన్నానని రాశాడు. మిగిలిన వాళ్లుకూడా తలా కొస్తా పంపుతారు. మాలో ఏ ఒకణ్ణో మిగిలిన వాళ్లం చూస్తూ చూస్తూ చావనివ్వం...... అసలు రహస్యం నీ కర్థంకాలేదు. మేం రంగయ్య తాతతో ఊరికే పోట్లాడి ఇవతలికి రాలేదు. శాస్త్రీయంగా ఆ ముసలాడిమీద తిరుగబాటు చేశాం!'' అన్నాడు.

''వెళ్లిరా, బాబూ! మీరే గెలిచారు. సందేహంలేదు'' అంటూ నా దారి నేను పట్టాను.